నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శనివారం
21 సెప్టెంబరు
2024
పేజీలు 8

గుంటూరు పల్నాడు

# జెండా పీకేద్దాం..!

- గేట్లు తెరిచిన పవర్ స్టార్..వైసిపి నుండి జంప్ అవుతున్న లీడర్లు
- జనసేనకు ఫిక్స్ అవుతున్న సీనియర్లు
- సమర్థవంతమైన లీడర్‌గా పవన్ కళ్యాణ్
- ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోనూ జనసేనలో చేరికలు



బలమైన కేడర్.. సమర్థుడైన లీడర్ ఉన్నప్పటికీ.. జనసేనకు వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో సరైన నాయకులు లేరు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన జనసేన విషయంలో ఆ లోటు స్పష్టంగా కనిపించింది. మొన్నటి ఎన్నికల్లో పవర్ స్టార్ పార్టీ 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభా స్థానాల్లో మాత్రమే పోటీ చేసింది. ఆ సందర్భంగా పవన్ సైతం నాయకత్వ లేమిని పరోక్షంగా అంగీకరించారు. అయితే.. పొత్తుల బలం, పవన్ ఛరిష్మాతో జనసేన హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించింది. జనసేనాని డిప్యూటీ సీఎం అయ్యాక ఆ పార్టీ ఫేట్ మారిపోయింది..

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, నేటి దినపత్రిక సూర్య:** వైసీపీ చీఫ్ జగన్ నిర్ణయాలతో విసిగివేసారి పోయిన ఆ పార్టీలోని బడా నేతలంతా ఇప్పుడు రాజీనామాలు చేస్తున్నారు. అలాంటి బడా సీనియర్లకు జనసేన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ప్రకాశం జిల్లాలో తిరుగులేని నాయకుడిగా పేరున్న బాలినేని.. జనసేనలో ఎంట్రీకి రెడీ అయ్యారు. మరోవైపు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తన అనుచర వర్గంతో కలిసి జనసేనలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అలాగే ఉభయ గోదావరి జిల్లాలలో ఇప్పటికే ఏలూరు జిల్లా పార్టీ

మిగతా 3లో..

## కల్తీ పాపం చంద్రబాబుదే.. వైఎస్ జగన్



**అమరావతి, మేజర్ న్యూస్:** తిరుమల ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఖండించారు. ఒక సీఎం ఇలా అబద్ధాలు ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేనా? అని నిలదీశారు. అమరావతిలో ఆయన శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ, తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ జరిగినట్లు వంద రోజుల తరువాత ఎందుకు బయటకొచ్చిందని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే కల్తీ జరిగినట్లు తేలిందన్నారు. దశాబ్దాలుగా లడ్డూ తయారీ విధానంలో ఒకే

మిగతా 3లో..

## తండ్రికి తగ్గ తనయుడు యరపతినేని నిఖిల్

**దాచేపల్లి మేజర్ న్యూస్ :** నగర పంచాయతీలోని 20వ వార్డు నందు గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ జన్మదిన వేడుకలు శుక్రవారంకన్నుల పండుగగా నిర్వహించారు . ముందుగా టపాసులు పేలుస్తూ , కేకును కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 20వ వార్డు



మిగతా 3లో..

## ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు





- గుంటూరు జిల్లా కలెక్టర్ వెల్లడి
- సంక్షేమ వైపు అడుగులు వేసిన 100 రోజుల పాలన
- గుంటూరు ఘనంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అంకమ్మ నగర్ లో " ఇది మంచి ప్రభుత్వం " కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పాల్గొన్నారు. అంకమ్మనగర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాలను తెలియజేశారు. అమలు చేసిన కార్యక్రమాలు వివరిస్తూ రూపొందించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేసి మన మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వృద్ధాప్య పెన్షన్ ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారని. దివ్యాంగ పెన్షన్ ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడం జరిగిందని. శాశ్వత అంగవైకల్యం ఉన్నవారికి పెన్షన్ రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచి ఇంటి వద్దకే ప్రతి నెల మొదటి తేదీ ఉదయాన్నే క్రమం తప్పకుండా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,400 పోస్టులు భర్తీకి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పేదవారి ఆకలి తీర్చేలా ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ ల్యాండ్ టైటిల్ యాక్టింగ్ రద్దు చేయడం జరిగిందన్నారు. ఇటీవల వచ్చిన వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మిగతా 3లో..

## అంబటి మురళీకృష్ణ అక్రమ కట్టడాల విషయంలో చర్చకు నేను సిద్ధం..... ధూళిపాళ్ల



**పొన్నూరు మేజర్ న్యూస్:** పొన్నూరు వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన అంబటి మురళి కృష్ణ అధికారాన్ని అడ్డుపెట్టుకొని గుంటూరు పట్టణంలో కొట్లాది రూపాయల విలువ చేసే భూములు అప్పనంగా కొట్టేశాడని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. స్థానిక డివిసి కాలనీలో ఏర్పాటుచేసిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ల్యాండ్ ఓనర్స్ ని బెదిరించి తక్కువ ధరకుభూములు లాక్కున్నాడని ఆయన ఆరోపించారు.ఈ విషయంలో బాధితులు ఏ కేసు పెట్టిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.దొంగ పర్మిషన్లు సృష్టించి అక్రమ కట్టడాలు కడుతున్నారని ఆయన అన్నారు.గత ప్రభుత్వ హయాంలో నాపై 33 అక్రమ కేసులు బనాయించారని ఆయన తెలిపారు.అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడింది గత ప్రభుత్వంలోని నాయకులే నని వారి అక్రమాలను నేను నిరూపిస్తానని చాలెంజ్ చేశారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కు అంబటి మురళీకృష్ణ పన్ను బకాయిలు ఉన్నారని ఆయన తెలిపారు.అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ ఉద్యోగులతో అడ్డగోలు సంతకాలు పెట్టించుకున్న ఘనత వైకాపా వారిదేనని దూళిపాళ్ల దుయ్యబట్టారు.అంబటి మురళీకృష్ణ అక్రమ కట్టడాల విషయంలో చర్చకు నేను సిద్ధ మనీ ఆయన సవాలు విసిరారు.

## వరద బాధితుల సహాయార్థం పిట్స్ కళాశాల యాజమాన్యం విరాళం



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్:** ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన బాధి తుల సహాయార్థం మేము సైతం అంటూ దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో గల ప్రియదర్శిని విద్యా సంస్థల యాజమాన్యం విరాళంను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేసినట్లు విద్యాసంస్థల అధినేత చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్. కు ఇంజనీరింగ్ కళాశాల ల ప్రిన్సిపల్స్ వివిధ విభాగాధిపతు.లు ,మంత్రి లోకేష్ ను కలిసి చెక్కును అందజేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు.

## బీసీజీ వ్యాక్సిన్ తో పెద్దల్లో క్షయ వ్యాధికి చెక్



**గుంటూరు మెడికల్:** బీసీజీ వ్యాక్సిన్ తో పెద్దల్లో క్షయ వ్యాధిని నివారించవచ్చని తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ అన్నారు. కొల్లిపరలోని మూడు బీసీజీ వ్యాక్సిన్ కేంద్రాలను శు క్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ కరోనా వ్యాక్సిన్ కాదని తెలిపారు. సుమారు వంద ఏళ్ళ నుండి చిన్న పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నారని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెద్దలకు కూడా అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. ఈ వ్యాక్సిన్ వల్ల పెద్దల్లో 15 ఏళ్ల వరకు క్షయ వచ్చే అవకాశం లేదని చెప్పారు. 60 ఏళ్ళు దాటిన వృద్ధులు, మధుమేహం ఉన్నవారు, ఐదేళ్ల నుండి క్షయకు మందులు వాడుతున్నవారు, వారి కుటుంబ సభ్యులు, 18 ఏళ్ల లోపు ఊబకాయం ఉన్నవారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకునేల వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లు వీ లక్ష్మీ, జే మనిమ్మ, డీ అనిత, ఏం ఎల్ హెచ్ పిలు బీ సుస్మిత, బీ రమ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనర్హులు పెన్షన్లు పొందుతున్నారంటూ ఆందోళన చెందుతున్న ప్రజలు

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండల పరిధిలోని గ్రామాలలో అనర్హులు , అక్రమార్కులు పెన్షన్లు పొందుతున్నారంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు .బహుళ అంతస్తుల భవనాలు భూములు కలిగి ఉండడంతో పాటు ప్రవాస భారతీయుల తల్లిదండ్రులు కూడా అప్పనంగా పెన్షన్లు తీసుకుంటున్నారంటూ నిజమైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈమని, దుగ్గిరాల మొరంపూడి, చింతలపూడి ,చిలువూరు, తుమ్మపూడి, పేరు గల పూడి రే,వేంద్రపాడు, వీర్లపాలెం పేదపాలెం, గొడవ.ర్రు శృంగారపురం, పెనుమూలి, కంఠం రాజు కొండూరు, పెద కొండూరు ,తుమ్మపూడి మంచి కలపూడి తదితర గ్రామాలలో వైసిపి పార్టీ సానుభూతిపరులు పెన్షన్లు పొందుతున్నారంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు .పెన్షన్ తో పాటు జగనన్న ఇంటి స్థలాలు కూడా మధ్యవర్తుల సహాయంతో అధికారులు లంచాలకు ఆశపడి భవంతులు భూములు , ఇన్ కం, టాక్స్ పే చేసే అభ్యర్థులకు స్థలాలు కట్టబెట్టి లక్షలాది రూపాయలు చేతులు మారాయి అంటూ

## దొంగలు బాబోయ్...దొంగలు...





**గుంటూరు – మేజర్ న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీలలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు... అసంపూర్తి నిర్మాణంగా ఉన్న గృహాల్లోని కరెంటు వైర్లు తెంచుకొని పోవడం, పిల్లల్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న బీరువాలను పగలగొట్టి వస్తువులను చోరీ చేయడం పనులతో స్థానిక కాలనీ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఏటుకూరు లేఅవుట్ అయిదు లో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో పలు గృహాలు అసంపూర్తిగా ఉండడంతో అక్రమార్కులకు అడ్డాగా మారింది. నిత్యం పేకాట, వ్యభిచార వంటి అసాంఘిక చర్యలతో కాలనీ రాజ్యమేలుతుంది. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో దొంగలకు నిలయంగా మారిపోయింది. కాలనీకి సరైన మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో నివాసం ఉంటున్న ఒకరిద్దరు కూడా అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసుల పెట్రోలింగ్ సరిగా లేకపోవడంతో దొంగలు దర్జాగా చోరీలకు పాల్పడుతున్నారు. సుమారు రెండు రోజుల క్రితం పున్నారావు అనే వ్యక్తికి చెందిన ఇంట్లో దొంగలు పడి ఇంట్లో ఉన్న బీరువాను బీరువాలో ఉన్న బంగారు వస్తువులను దొంగిలించుకుపోయారు. నల్లపాడు పోలీసులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జగనన్న కాలనీలో విద్యుత్తు నీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయగలిగితే కాలనీలో ఉండేందుకు వీలు ఉంటుందని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా జగన్ అన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉన్నతాధికారుల ఆదేశాలతో చరిత్ర సృష్టించిన దళిత ఎస్సైలు: ప్రశాంతంగా ముగిసిన కొలకలూరిలో గణేష్ నిమజ్జనం







**తెనాలి క్రైమ్ మేజర్ న్యూస్:** సెప్టెంబర్ ఏడో తారీఖున మొదలైన వినాయక చవితి ఉత్సవాలు సెప్టెంబర్ పందోంమిది గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. వినాయక చవితి పండుగ అంటేనే ఒకవైపు ఆనందం మరోవైపు ఆందోళన. మేజర్ పంచాయతీ అయిన కొలకలూరు గ్రామంలో 23 కులాలు ఉండగా,పేరు ప్రఖ్యాతగాంచిన కొలకలూరు లో అందరూ అన్నదమ్ములు వలె ఉంటారు. కానీ కొందరు స్వార్ధపరులు తమ స్వప్రయోజనాల కోసం అమాయక పిల్లలను అడ్డుపెట్టుకుని గ్రామంలో అల్లర్లు సృష్టించి, అధికారులు ముందు నాయకత్వం వహించి, దళారీ దాదులు కులాల మధ్య కుమ్ములాట పెట్టి, పంచాయితీలు రూపంలో అధిక సొమ్ము చేసుకుంటూ, పబ్బం గడుపుతూ ఉంటారు. గ్రామంలో ఇలాంటివారు కొందరు ఉన్నారు అలాంటి వారి వల్ల వినాయక చవితి పండగకు అల్లర్లు జరగకుండా లేని సంవత్సరము లేదు అని గ్రామస్తులంటారు. పేరు ప్రఖ్యాతలుగాంచిన కొలకలూరులో కొందరి స్వార్ధ పరుల వల్ల అధికారుల్లో సమస్యాత్మక గ్రామంగా నిలిచిందని,అలాంటి గ్రామంలో ఈ సంవత్సరం వినాయక చవితికి కొందరు స్వార్ధపరులు అల్లర్లు సృష్టించి, రాజకీయంగా వర్గ విభేదాల ద్వారా కొందరు నాయకులు పై బురద చల్లాలని, పథకం పన్నారని, వినాయక చవితి పండుగనే అవకాశం గా తీసుకుని సిద్ధంగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపించారు. అది తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు తెనాలి డిఎస్పి జనార్ధన్ రావు ,అనుభవజ్ఞులైన రూరల్ సి.ఐ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, రూరల్ ఎస్సై సిహెచ్. ప్రతాప్ కుమార్, కొల్లిపర ఎస్సై పి. కోటేశ్వరరావు,త్రీ టౌన్ ఎస్.ఐ. ఎన్. ప్రకాష్ రావులను ముందుంచి, ఇతర సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని, ఊరేగింపుల సమయాలలో ఎటువంటి అల్లర్లు జరగకుండా, ఎస్సైలు తమ అధికారులకు అప్పగించిన ఆదేశాలను అంకితభావంతో పని చేస్తూ, విగ్రహాల కమిటీల వారిని సంప్రదిస్తూ అల్లరిమూకలపై దృష్టి పెట్టి, ఊరేగింపు సమయాలలో బొమ్మల వెంట తిరుగుతూ, నిద్ర ఆహారాలు మాని, చిన్న వివాదానికి కూడా చోటు లేకుండా చేసి దమ్ముగా నిలిచిన దళిత ఎస్సైలు. ఇలాంటి దళిత ఎస్సైలు ఉన్నారు కనుకనే సామాజిక వర్గంలో ఉన్న దళారీలు, అల్లరి మూకలు ముందుకు రాలేకపోయారని ప్రజలు అంటున్నారు.

ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా, అల్లరిమూకలపై నిఘా ఉంచి, ప్రధాన కూడలి నందు పోలీస్ బందో బస్తు నిర్వహించి,కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ,ఉత్సవాల కమిటీ వారితో ఎప్పటికప్పుడు జాగ్రత్తలను పాటించేలా చర్యలు చేపట్టారు.గతంలో ఉన్న ఎస్.ఐ. ఆనాటి అధికార పార్టీకి కొమ్ముగాయటం వలన వివాదాలు చోటు చేసుకొని, అమయాకులపై తప్పుడు కేసులు పెట్టి వివాదాలకు కారకుడు అయ్యాడని గ్రామస్తులు తెలిపారు. కాని నేడు నిస్పక్షపాతంగా అందరూ సమనులే అని ,శాంతి భద్రతలే మాకు ముఖ్యంమని, అధికారుల ఆదేశాలను అంకిత భావంతో పని చేస్తామని ఎస్సైలు అంటూ, ఎవరిని లెక్కచెయకుండా,

మునుపెన్నడూ జరగని విధంగా వినాయకుని నిమజ్జనం కొలకలూరు లో ప్రశాంతంగా ముగిసిందనీ ప్రజలు పోలీస్ అధికారులను ప్రశంసిస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**పెదకాకాని మేజర్ న్యూస్:** రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పుప్పాల సత్యనారాయణ పేర్కొన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ ల పిలుపు మేరకు పొన్నూరు నియోజకవర్గం శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాలు మేరకు కూటమి ప్రభుత్వం 100రోజులు లో సాధించిన విజయాలు ఇది మంచి ప్రభుత్వం అను కరపత్రాన్ని పెదకాకాని మండలం పెదకాకాని గ్రామం పాతూరు ఏరియా నందు ఇంటింటికి తిరుగుతు కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వివరించారు మొదటి రోజు భాగంగా ఈ వంద రోజుల్లో జరిగినటువంటి అభివృద్ధి కార్యక్రమాలు మెగా డీఎస్సీ గాని అన్న క్యాంటీన్ కానీ అలానే ల్యాండ్ టైటిల్ ఆక్ట్ రద్దు పెన్షన్ ఒకేసారి వేయి రూపాయలకు పెంచినటువంటి వాటి గురించి ఇలా అన్ని విషయాల్లో జరిగినటువంటి అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడం జరిగింది.

## అనేక పోషకాలు ఆకుకూరల్లోనే...



**తాడికొండ, మేజర్ న్యూస్:** అనేక పోషకాలు ఆకుకూరల్లోనే లభ్యమవుతాయని తాడికొండ అంగనవాడి పర్యవేక్షకురాలు వై. శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం బడే పురంలోని నూతక్కి లక్ష్మీ దేవమ్మ అంగన్వాడి సెంటర్లో పౌష్టికాహార మహోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పర్యవేక్షకురాలు శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు గర్భిణీలు మునగాకు ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల నుంచి అందించే గ్రుడ్డు, పాలు, పప్పులు తదితర ఆహార పదార్థాలతో పాటు ప్రతిరోజు ఆకుకూరలు, పండ్లు డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల రక్తహీనత తదితర రుగ్మతలు రాకుండా జాగ్రత్త పడవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈ పద్మావతి బి నాగమ్మ అంగన్వాడి కార్యకర్తలు సువర్ణ, బాయమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దొండపాడువరద బాధితులకు లక్ష రూపాయలు చెక్కు అందజేత...



**తుళ్లూరు మేజర్ న్యూస్.** ఇటీవల రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు కారణంగా వరదల్లో చిక్కుకున్న బాధితులకు రాజధాని అమరావతి ప్రాంతం దొండపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కు లక్ష రూపాయలు చెక్కును అందజేసారు శు క్రవారం గుంటూరు టీడీపీ తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయం లో వరద బాధితులకు సహాయార్థం సీఎం సహాయ నిదికి దొండపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ తరుపున 1లక్ష రూపాయల చెక్కును తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ కు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు కోసం నిరంతరం శ్రమిస్తున్నారు అని తన వయస్సు కూడా లెక్క చేయకుండా అర్ధరాత్రి సమయంలో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి వారికి మనో డైర్యం కలిగించారని రాష్ట్ర ప్రజలు పేద వర్గాల కోసం తమ వంతు సహాయాన్ని అందించామని టీడీపీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ మైనేని గిరిజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు





# నో డిమెన్షియా, అల్జీమర్స్

**ఎప్పుడో అప్పుడు ఏదో ఒకటి మర్చిపోవడం, మళ్లీ అది గుర్తుకురావడం సాధారణ విషయమే.. కారులో పెట్టిన సెల్ ఫోన్, ర్యాక్‌లో ఉంచిన బండి తాళాలు, తలపై పెట్టిన కళ్ల అద్దాల గురించి ఎప్పుడూ మర్చిపోతూనే ఉంటాం. కానీ, ఒక రోజు ఏకంగా మీ ఇంటి అడ్రస్ మర్చిపోతే, మీ ఇంట్లో వాళ్ల పేర్లు, ముఖాలు మర్చిపోయి గజినీలా తయారైతే.. ఈ ఊహే ఎంతో భయంకరంగా ఉంటుంది. అల్జిమర్స్ వ్యాధి సోకిన వారి పరిస్థితి అచ్చం అలాగే ఉంటుంది. అర్జిమర్స్ ఉన్న వ్యక్తులు ఇంటి నుంచి బయటకు వెళ్లినంత తేలికగా, తిరిగి ఇంటికి రాలేరు. ఎందుకంటే ఇంటి అడ్రస్‌నే మరచిపోయి ఉంటారు. తెలిసినవారు, కుటుంబ సభ్యులు పలకరించినా.. అయోమయంగా చూస్తూ ఉంటారు. వారి ముఖాలను, పేర్లను మర్చిపోతారు. తనని తానే మర్చిపోతారు.. ఇంతకంటే దుర్భర జీవితం ఇంకొకటి ఉండదు కదా. ఈ రోజు(సెప్టెంబర్ 21) ప్రపంచ అల్జీమర్స్ దినం. అల్జీమర్స్‌పై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అల్జీమర్స్ డే నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అసలు అల్జీమర్స్ అంటే ఏమిటి, దాని లక్షణాలు, ఎందుకు వస్తుంది, చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి .. డా.పి.విజయ (న్యూరోసైన్సెస్ విభాగం) ద్వారా తెలుసుకుందాం..**



**నివేదికల ప్రకారం:** 60 ఏళ్లు పైబడిన వారిలో 7.4 శాతం మంది, దాదాపు 8.8 మిలియన్ల మంది భారతీయులు మెదడు రుగ్మతలతో జీవిస్తున్నారని అంచనా. ఇది హృదయ సంబంధ వ్యాధుల వంటి ప్రమాద కారకాల వేగవంతమైన పెరుగుదలతో కూడా ముడిపడి ఉందని పాన్-ఇండియా అధ్యయనం వెల్లడించింది.

## నేడు అల్జీమర్స్ డే | డాక్టర్ పి.విజయ

### ఈ జన్యువుదే కీలకపాత్ర

కుటుంబసభ్యులలో ఎవరైనా అల్జీమర్స్ బారినపడితే ఆ కుటుంబంలోని వారికి కూడా వచ్చే ముప్పు ఉంటుంది. వృద్ధాప్యమే అల్జీమర్స్ అభివృద్ధి చెందడానికి ప్రధానమైన కారకంగా నిలుస్తుంది. నివేదికలను అనుసరించి, 65 ఏండ్లు దాటినవారిలో అల్జీమర్స్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. కపాలానికి గాని, తలకు గాని బలమైన గాయం అయిన సందర్భాలు కూడా మెదడు మీద దుష్ప్రభావాన్ని కలగజేస్తాయి. జన్యుపరమైన కారణాలు కూడా అల్జీమర్స్‌కు దారితీస్తాయి. ఈ వ్యాధికి 'ఏపీఓఈ- ఈ4' జన్యువు సాధారణమైన కారణంగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దాదాపు పావు వంతు అల్జీమర్స్ కేసులలో ఈ జన్యువుదే కీలకపాత్ర.

### అల్జీమర్స్ వ్యాధికి ప్రమాద కారకాలు ఏమిటి?

డిమెన్షియా ఓ సాధారణం పదం. దానిలో అల్జీమర్స్‌లో ప్రత్యేకమైనది. దానినే కామ్‌నెస్ డిమెన్షియా అని అంటారు. 60 నుంచి 70 శాతం మందికి అల్జీమర్స్ డిమన్షియానే అవుతుంది. వయస్సు బట్టి రోగి తన్నపకశక్తిని, పని చేసే సామర్థ్యాన్ని, సమాజంలో ఆ వ్యక్తి సాధారణ ప్రవర్తన కోల్పోయినట్టు కనిపిస్తాడు. 65 ఏళ్ల వయస్సులో సుమారు 6 శాతం మందికి అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది. 85 ఏళ్ల తర్వాత 30 శాతం అల్జైమర్స్ వచ్చే అవకాశం ఉంటుంది".

### ఈ న్యూరోలాజిక్ డిజార్డర్‌కు కారణమయ్యే ప్రమాద కారకాలు

పెద్ద వయస్సు, వంశపారంపర్యంగా, మానసిక క్షీణత, హెడ్ గాయాలు, కార్డియోవాస్కులర్ వ్యాధి, శారీరక నిష్క్రియాత్మకత, ధూమపానం, గాలి కాలుష్యం

### అల్జీమర్ రాకుండా ఏం చెయ్యాలి

మందు లేని ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే... మన మెదడుకు పని చెబుతూనే ఉండాలి. రకరకాల పజిల్స్ ఆడాలి. లెక్కలు చేస్తూ ఉండాలి. సుడోకు లాంటివి ఆడాలి. అలాగే.. బాగా చదవాలి. మెదడుకు మేలు చేసే ఖర్జూరాలు తినాలి. అలాగే ఆకుకూరలు, కూరగాయలు, గింజలు, పప్పులు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. నాన్ వెజ్ తినేవారైతే వారానికి ఓసారి చేపలు, వారానికి రెండుసార్లు చికెన్ వంటివి తినాలి. ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల అల్జీమర్స్ వ్యాధి ప్రభావాలను నివారించవచ్చు. కుటుంబ సభ్యులు అల్జిమర్స్ తో బాధపడుతున్న వారికి తగిన తోడ్పటును అందించటం చాలా ముఖ్యం. బ్రెయిన్‌కి పని చెబుతున్నంతకాలం... అల్జీమర్స్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని డాక్టర్ పి .విజయ సూచిస్తున్నారు.



**డా.పి.విజయ** ఎండి

**.డిఎం.ఎఫ్డబ్ల్యూ ఎస్ఓ, ఎఫ్ఐఏఎన్, హెచ్ఓడి న్యూరో సైన్సెస్ విభాగం, ప్రెసిడెంట్ ఎలెక్ట్ - ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, డైరెక్టర్ - అంకినీడు స్ట్రోక్ సెంటర్, లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్.**

## గొర్లవారిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం'



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు రూరల్ మండలం గొర్లవారిపాలెం గ్రామంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. పత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వంద రోజులు విజయవంతంగా పూర్తి చేసుకొని ప్రజల మన్ననలు పొందిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని సూచించారు. వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని , వంద రోజులలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వజ్ర శ్రీ, ఎంపీడీవో ఆదినారాయణరావు, మండల ఉపాధ్యక్షురాలు దర్శి సుజాత, పిఓపిఆర్డి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు భీమినేని వందనాదేవి, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ మాధవరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇమ్మడి లీలామల్లేశ్వరరావు, జనసేన అధ్యక్షులు గంధం సురేష్, సిహెచ్ త్రినాధ్, నల్లపనేని సురేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వైద్య పరీక్షలు



**గుంటూరు మెడికల్:** ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేసే ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఐటిసి బంగారు భవిష్యత్ ప్రతినిధులకు గుంటూరు నగరపాలక సంస్థ నుండి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ గారు అన్నారు. శుక్రవారం స్వచ్చత హి సేవాలో భాగంగా స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఐటిసి బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు, ఆర్థిక పొదుపు పై అవగాహన శిబిరంలో నగర కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య రక్షణకు తెల్లవారుజాము నుండే విధుల్లో ఉండే ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు, వారికి ఆర్థిక అంశాలపై ఐటిసి బంగారు భవిష్యత్ ప్రతినిధులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నగర కమిషనర్ గా భాధ్యతలు తీసుకున్న తర్వాత పారిశుధ్యం, త్రాగునీరు ప్రధమ ప్రాధాన్యతలుగా ప్రకటించామని, విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొన్నకార్మికులకు త్వరలో 2 జతల బట్టలు అందిస్తామన్నారు. అలాగే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు జిఎంసి తరుపున నియోజకవర్గాల వారీగా మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో ఊరంటే గుంటూరు పేరుతో పారిశుధ్యంలో మెరుగైన ఫలితాలు సాధించామని, త్వరలో మెరుగైన పారిశుధ్యంకు స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్దం చేస్తామన్నారు. కార్మికుల సమస్యలపై నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

## జెండా పీకేద్దాం..!

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని వైసీపీకి రాజీనామా చేశారు. తాజాగా 2019 ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌పై అనూహ్య విజయం సాధించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇప్పుడా పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

**ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోనూ..** ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోనూ వైసీపీకి ఎదురుదెబ్బలు తగులుతాయని తెలుస్తుంది. చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గుంటూరు వెస్ట్ వైసీపీ ఎమ్మెల్యే గా పరాజయం తర్వాత విడుదల రజిని వైసీపీ కార్యకలాపాల్లో చెప్పుకునే విధంగా కనిపించడం లేదు. అయితే.. ఆమె వైసీపీని వీడి మరో పార్టీలో చేరతారనే పుకార్లు  షికార్లు చేస్తున్నాయి..? ఇక రజని బాటలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని కొందరు వైసీపీ నేతలు వైసీపికి రాజీనామా చేసి జనసేన జెండాను భుజానికి ఎత్తుకోవడానికి రెడీ అయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి.

## కల్తీ పాపం చంద్రబాబుదే.. వైఎస్ జగన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కాగా, చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలన అంతా మోసమేనని ధ్వజమెత్తారు. చంద్రబాబు వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ లేదు.. సెవెనూ లేదంటూ విమర్శించారు వైఎస్ జగన్. చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నీ తిరోగమనంలో ఉన్నాయన్నారు. గోరు ముద్ద గాలికి ఎగిరిపోయిందని, ఆరోగ్య శ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని జగన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటివరకూ వసతి దీవెన, విద్యా దీవెను కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. 108, 104 ఉద్యోగులకు ఇప్పటివరకూ జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ ప్రజల జీవితాలతో ఆటలాడరని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

## తండ్రికి తగ్గ తనయుడు యరపతినేని నిఖిల్

(మొదటిపేజీ తరువాయి)

కౌన్సిలర్ ముశ్యం శ్రీనివాసరావు మాట్లాడుతూ, గురజాల నియోజక వర్గంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో ముందుంటూ, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తండ్రికి తగ్గ తనయుడుగా చేయూతనందించడంలో మహారాజుగా నిలిచాడనీ, తండ్రి ఆశయాలను ఊపిరిగా భావిస్తూ అడుగులు వేస్తున్నాడని, భగవంతుని దయవల్ల నిఖిల్ బాబు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని, భవిష్యత్తులో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన కోరారు. ముశ్యం సీతారామయ్య, సయ్యద్ సైదా, సయ్యద్ సుభాని, సాగి శ్రీను, పరమార్ధన్ రావు, ఉడత సత్యం, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

11 రోజులు స్వయంగా క్షేత్రస్థాయిలో సహాయక పునరావాస కార్యక్రమం పర్యవేక్షించడం జరిగిందన్నారు. రూ.1674 కోట్లు ధాన్యం కొనుగోలు బకాయిలు రైతులకు జమ చేయడం జరిగిందన్నారు. ఇసుక విధానాన్ని మెరుగుపర్చి 2019 కంటే తక్కువ ధరకే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి స్థానికులతో మాట్లాడుతూ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. సామాజిక భద్రతా పెన్షన్లు గత రెండు నెలలుగా ఉదయాన్నే అందిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్లు మొదటి తేదీన ప్రభుత్వం జమ చేస్తుందని స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. అంకమ్మ నగర్ లో పారిశుధ్య కార్మికులు  సక్రమంగా వ్యర్థాలు తొలగించడం లేదని ,  కాలువలు శుభ్రపరచడం లేదని స్థానికులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతి ఇంటికి వెళ్లి వ్యర్థాలు సేకరించేలా పర్యవేక్షించాలని, ప్రస్తుతం పని చేస్తున్న వారి పారిశుద్ధ్య  కార్మికులను వేరే ప్రాంతాలకు బదిలీ చేసి ఇక్కడ వేరే వారిని నియమించాలని, అంకమ్మ నగర్ లోని కాలువలన్నింటిని రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పూడిక తీసి శుభ్రం చేయాలని శానిటరీ సూపర్వైజర్ ను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ , జెడ్పి డిప్యూటీ సిఈఓ మోహన్ రావు, వార్డు సచివాలయాల సూపరింటెండెంట్ శివన్నారాయణ , ఉపా సెల్ సూపరింటెండెంట్ వేణు బాబు , గుంటూరు పశ్చిమ మండల ఇన్ చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్ , సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మెరుగైన పాలన, అందించిన కూటమి ప్రభుత్వం

**తెనాలి మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన మీద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పరిపాలన గురించి తెనాలి ఒకటి రెండు వార్డులలో ఇంటింటికి తిరిగి వారి అభిప్రాయాలు తెలియజేసుకోవడం జరిగింది. అందరూ పరిపాలన మీద నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం మీద పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. బుడమలేరు వరదల్లో ఇబ్బంది విజయవాడ బాధితులకు వయసును కూడా లెక్కచేయకుండా రేత్రనకా పగలనకా వారి బాగోగులు ఇంటి పెద్ద కొడుకు వలె చూశాడని ప్రతి ఒక్కరూ కొనియాడటం తెలుగుదేశం అభిమానులలో ఎనలేని ఆనందం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణ చంద్, తెలుగుదేశం నాయకులు కనిగంటి మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, కాకుమాను సత్యనారాయణ, రామ్మోహన్ రావు, వేమూరి గౌతమ్, ఈదర రాజమల్లు ఒకటో వార్డు రెండో వార్డ్ ల సచివాలయం అడ్మిన్స్ ఆలపాటి నాగార్జున, చొప్పర మాధవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఈసిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** స్థానిక ఎన్ఈసి కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించామని కళాశాల చైర్మన్ శ్రీ ఎం.వి. కోటేశ్వరరావు తెలియచేసారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులను స్వాగతించడానికి నికి రెండవ సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వారిని అభినందించారు. వైస్ చైర్మన్ శ్రీ మిట్టపల్లి చక్రవర్తి గారు భవిష్యత్ నిపుణులను రూపొందించడంలో సాంకేతిక విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియచేసారు. విద్య మరియు పాఠ్యేతర కార్యకలాపాల మధ్య సమతుల్యతను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విజయాన్ని సాధించడంలో ఆత్మవిశ్వాసం మరియు సంకల్పం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ఎన్ఈసిలో ఉన్న వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మరియు శ్రేష్ఠత కోసం ప్రయత్నించాలని కొత్త విద్యార్థులను ప్రోత్సహించారు. సెక్రటరీ, శ్రీ మిట్టపల్లి రమేష్ గారు, విద్యార్థులు వ్యక్తిగతంగా మరియు విద్యాపరంగా ఎదగడానికి సహాయపడే సహాయక వ్యవస్థల గురించి మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని మరియు వారి జీవితంలో క్రమశిక్షణను పెంపొందించుకోవాలని ఆయన ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు క్రియేటివిటీని పెంపొందించుకొని నూతన ఆవిష్కరణలను చేయాలని అభిలషించారు. వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ డి. సునీల్, ఫ్రెషర్స్ కు హృదయపూర్వక స్వాగతం పలికారు, జీవితంలోని ఈ ఉత్తేజకరమైన దశలోకి మొదటి అడుగు వేసినందుకు మొదటి సంవత్సరం విద్యార్థులను డా. కె.పాన్నారి లక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహభరితమైన మరియు పండుగ వాతావరణాన్ని జోడించాయి. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పాటలు, జూడో, యోగా మరియు స్కిట్లు విద్యార్థుల విభిన్న ప్రతిభను ప్రదర్శించి ఆనందకరమైన వాతావరణాన్ని సృష్టించాయి. ప్రిన్సిపాల్, ఇతర ప్రముఖులతో కలిసి, ఫ్రెషర్స్‌కు భావకలను పంపిణీ చేశారు.

## ప్రతిభా రివార్డు అందుకున్న పట్టణ సీఐ, ఎస్ఐ



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టణ సిఐ, ఎస్ఐ లకు పోలీసు ఉన్నతాధికారులు రివార్డులను అందించారు. పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పి కంచి శ్రీనివాసరావులు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజి ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులకు రివార్డులను అందజేశారు. రివార్డులు అందుకున్న వారిలో సత్తెనపల్లి టౌన్ సి.ఐ బి.బ్రహ్మయ్య, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ యం.సంధ్యా రాణి లు ఉన్నారు. ఈ సందర్భంగా రివార్డులు అందుకున్న సిఐఎస్ఐలలో సత్తెనపల్లి డీఎస్పీ హనుమంత రావు, ఇతర సిబ్బంది అభినందించారు.

## ఇది మంచి ప్రభుత్వం... మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయకత్వం లోని కూట మి ప్రభుత్వం 100 రోజులు పూర్తయిన సందర్భంగా వంద రోజుల పాలనలో ప్రభుత్వం తీసుకున్న ప్రతిష్టాత్మకమైన నిర్ణయా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు, స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పలు వార్డులలో ఇంటింటికి వెళ్లి మంచి ప్రభుత్వం అనే స్టికర్ని ఇంటింటికి మన ప్రభుత్వం గురించి వివరిస్తూ వారి గోడలకు అంటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి షేక్ కరీముల్లా. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి. సీనియర్ మహిళా నాయకురాలు మిరియాల రత్నకుమారి తెలుగు మహిళ అధ్యక్షురాలు అమరా రమాదేవి. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు. తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ అజారుద్దీన్. ఆళ్ల సీతారామి రెడ్డి. ముల్లా కరిముల్లా. తోట బ్రహ్మాస్వాములు. నాగపూర్ణ ఒంటి పులి వెంకట్. శివరావు. తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు . వివిధ హెూదా లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షోభంలోనూ సంక్షేమం.. ఇది మంచి ప్రభుత్వం ఘనత





### ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే "ఇది మంచి ప్రభుత్వం" అని ప్రజలే అనేలా కూటమి ప్రభుత్వం పని చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం గ్రామంలో వందరోజుల పాలనలో అమలు చేసిన పథకాలు ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే కన్నా వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 'ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 వంట గ్యాస్ సిలిండర్లు' ఇస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబు మహిళలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించ నున్నారని చెప్పారు. ఎన్టీఆర్ సుజలా స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా అధికారులు, డి.ఎన్.ఆర్. ఫౌండేషన్ అధినేత దరువూరి నాగేశ్వరరావు, నియోజకవర్గం, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పేదల పాలిట అక్షయపాత్రగా అన్న క్యాంటీన్లు : ఎమ్మెల్యే జీవీ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్టుగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన అన్నక్యాంటీన్లు పేదల పాలిట అక్షయపాత్రగా ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అభివర్ణించారు . పేదల కష్టం, ఆకలిబాధ తెలిసిన వ్యక్తిగా చంద్రబాబు తెలుగుదేశం గత ప్రభుత్వంలోనే ప్రారంభించిన అన్నక్యాంటీన్లపై కూడా జగన్ కక్షతీర్చుకోవడం దారుణమైన విషయంగా ఆయన పేర్కొన్నారు. వినుకొండలోని తల్లి పిల్లల వైద్యశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. పలువురికి స్వయంగా అల్పాహారం వడ్డించారు. స్థానిక ప్రజలు, పలువురు ప్రజాప్రతినిధులు అక్కడే అల్పాహారం తిన్నారు. అనంతరం పలువురు పేదలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు ఎమ్మెల్యే జీవీ. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిన ఆయన అన్ని దానాల్లో కంటే అన్నదానం చాలా గొప్పదన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని చాటిచెప్పిన మహానాయకుడు అన్న ఎన్టీఆర్ అని, ఆయన బాటలో సమాజంలో ఉన్న పేదలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బున్న వాళ్లకి ప్రభుత్వ సహకారం అవసరం లేదని, ఎవరైతే పేద ప్రజలు ఉన్నారో వారితో పాటు కూలినాలి పనులు చేసుకుంటూ రూ.300, రూ.400, రూ.500 సంపాదించే కార్మికులకు, పేదలకు ఈ అన్న క్యాంటీన్ల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. దాన్ని గుర్తించిన చంద్రబాబు గతంలో తెదేపా ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చారన్నారు. మధ్య జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లు మూసివేయించారని మండిపడ్డారు. వినుకొండలో అన్న క్యాంటీన్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హరేకృష్ణ వంటి ఆధ్యాత్మిక సంస్థలకు అన్న క్యాంటీన్ల బాధ్యతను అప్పగించడం మరో ఆనందదాయకమైన అంశమని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిజాయతీగా పనిచేసే సంస్థలకు బాధ్యతలు అప్పగించి సీఎం చంద్రబాబు ఎంతో మంచిపని చేశారన్నారు. పూటకు అయిదు రూపాయల చొప్పున 15 రూపాయలతోనే నిరుపేదలు మూడు పూటల కడుపు నింపుకునేలా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు చిరస్థాయిగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తన వివాహ దినోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్‌కు రూ.1,10,116 విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అన్న క్యాంటీన్‌కు ఎప్పుడు అవసరమైనా శివశక్తి ఫౌండేషన్, శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ద్వారా సహాయ, సహకారాలు అందించడానికి సంసిద్ధంగా ఉంటామని ప్రకటించారు. 100 రోజుల్లో 100కు పైగా సంక్షేమ పథకాలు అందించడం దేశ రాజకీయాల్లోనే ఒక చరిత్ర సృష్టించారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి హయాంలో 100 రోజులు అభివృద్ధితో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వారం రోజులపాటు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, జనసేన పార్టీ సమన్వయకర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్, బిజెపి నాయకులు మేడం రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ ఆయుభ్ ఖాన్, పీవీ సురేష్ బాబు, షమీంఖాన్, గంధం కోటేశ్వరరావు, వాసిరెడ్డి లింగమూర్తి, గట్టుపల్లి శ్రీనివాసరావు, పువ్వాడ కృష్ణ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు

# మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్య, విద్య చదువు కోవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం చిద్రం చేస్తుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ విమర్శించారు. నరసరావుపేట లోని రైల్వే స్టేషన్ రోడ్ లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట సాయికుమార్ మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. తన భాధ్యతను మరిచి ప్రయివేటు కు వైద్య, విద్య పట్టం కట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వలన కోల్పోయామని వెల్లడించారు. ఇది కేవలం వైద్య, విద్యను ప్రయివేటీకరణ చేయాలనే దుర్మార్గపు అలోచల నుండి చేస్తున్న చర్యగా భావిస్తున్నామని అన్నారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య, విద్యకు దూరం అవుతారని చెప్పుకొచ్చారు. తద్వారా రిజర్వేషన్ల ఊసే ఉండదని మరోవైపు వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని వివరించారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని నాడు ప్రకటించి ఇచ్చిన హామీపైన ఎందుకు నేడు నోరు మెదపడం లేదని వాపోయారు. అధికారం రాకముందు ఒకలా గద్దెకెక్కిన తరువాత ఆ ఊసెత్తకపోవడం కూటమి ప్రభుత్వపు వైఖరిగా ఉందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య, విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని సాయి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యస్.ఎఫ్.ఐ నాయకులు షాదుల్ల, నాని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర : మాజీ ఎమ్మెల్యే

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** నరసరావుపేట రోడ్డులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తీవ్రమైన ఆరోపణలు వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి కీలక నేతలతో సహా ప్రతి ఒక్కరూ ఏదాదికి ఒకసారైనా దర్శించుకుని తిరుమల లడ్డు ప్రసాదాన్ని స్వీకరిస్తారని చెప్పారు. పవిత్ర తిరుమల లడ్డు ప్రసాదం పై ఏ భక్తుడికి కూడా ఎటువంటి వాసన కానీ , రుచిలో తేడా గాని, లడ్డుపై ఎటువంటి అనుమానం ఎవరికి రాలేదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు జులై 17 తారీఖున ఎన్డిడిబి ల్యాబ్ కు నెయ్యి శాంపిల్స్ టెస్టింగ్ కొరకు పంపామని, జూలై నెల 21న దాని తాలూకు రిపోర్ట్ ఇచ్చిందని ఆ రిపోర్టు ప్రకారం నెయ్యిలో ఎనిమల్ ఫ్యాట్, ఫిష్ ఆయిల్ వంటి కొన్ని అపవిత్ర కారకాలు కలిపినట్లు రిపోర్ట్ వచ్చిందని చెప్పారని గుర్తు చేశారు. టీటీడీ ఈఓ శ్యామల రావు టిటిడి అధికారిణి సైతం నెయ్యిలో వనస్పతి కలిసిందేమోనని మాత్రమే చెప్పడం జరిగిందని




వివరించడం జరిగిందన్నారు. టిటిడి అధికారిణి కూడా తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రతిరోజు రెండు ట్యాంకర్లు నెయ్యి వస్తుందని, వచ్చిన వెంటనే మూడు రకాల శాంపిల్స్ తీసి టెస్టింగ్ చేసిన అనంతరం అవి బాగా ఉన్నాయని రిపోర్టు వస్తేనే ఆ ట్యాంకర్లను దిగుమతి చేసుకుంటామని తెలిపారు. కానీ చంద్రబాబు మాత్రం ఆయన నియమించిన అధికారులు ఇచ్చిన స్టేట్మెంట్లను సైతం పక్కనపెట్టి కేవలం రాజకీయ కోణంలోనే జగన్ పై తీవ్ర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన ఈ సంచలనాత్మకమైన స్టేట్మెంట్ ఆధారంగా, ఈ ఆరోపణల పై నేషనల్ మీడియాలో తీవ్రమైన చర్చ జరుగుతుంది. ఈ ఆరోపణల పై స్పందించిన వైవి సుబ్బారెడ్డి భూమన కరుణాకర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై స్పందించి నిజా నిజాలు నిగ్గు తేల్చాలని, ఎవరు తప్పు చేశారో తేల్చే అధికారం మీ వద్దనే ఉందని, మీరు తప్పుగా మాట్లాడారా నిజంగా తప్పు జరిగిందా అనేది వెంటనే తేల్చాలన్నారు. అంతేకాకుండా చంద్రబాబు నాయుడు రాజధాని మునిగిందని ఎవరైనా స్టేట్మెంట్ ఇస్తే వాళ్ళ నోటికి తాళం వేస్తానని, కేసులు పెడతామని అంటున్నారని ,మరి రాజధాని నిర్మాణానికి అమరావతి అనుకూలంగా లేదని వరల్డ్ బ్యాంక్ వారు చెప్పారని, ఆ విషయం మీ మంత్రి నారాయణ గారే స్వయంగా చెప్పారని మరి ఆయన ను,ఏం చేస్తారు అమరావతి రాజధాని నిర్మాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేదని చెప్పిన వరల్డ్ బ్యాంక్ ని ఏం చేస్తారని ,ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఏది ఏమైనప్పటికీ హిందువులకు పవిత్ర దేవస్థానమైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన సంచలన ఆరోపణలపై ప్రభుత్వం నిజ,నిజాలు వెంటనే నిగ్గు తేల్చి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల మనోభావాలు కాపాడాలని గోపిరెడ్డి టీడీపీ ప్రభుత్వాన్ని కోరారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంపీడీవో



**రెంటచింతల, మేజర్ న్యూస్ :** క్రీడల్లో పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ప్రగతి మెట్టు ఎక్కేందుకు దోహదపడతాయని ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయని అన్నారు. ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.అనంతరం పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో అండర్ 14 అండర్ 17 బాల బాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాపయ్య, హెడ్మాస్టర్ దుర్గాప్రసాద్ ,మండల కోఆర్డినేటర్ కత్తి రవి, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాని, బ్రహ్మయ్య, అంజలి, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ పాలనకు వంద రోజులు - కొమ్మాలపాటి

**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు చేరువగా ఉండి ప్రజా పాలనకు వంద రోజులు పూర్తి చేసుకున్నందుకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ ఆఫీసులో శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను కూటమి ప్రభుత్వం నిలుపుకుంటూ ముందుకు సాగుతోంది... గత వైసీపీ ప్రభుత్వం వంద రోజుల్లో కేవలం 250 రూపాయలు పింఛన్ పెంచారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పెంచిన



పింఛన్ మొత్తాన్ని 7000 రూపాయలు అందించి మాట నిలబెట్టు కున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నెల రోజుల పాటు వేతనాలు వేసేవారు, ఇప్పుడు ఉద్యోగులకు నెల మొదటి రోజునే అందుతు న్నాయని తెలిపారు. ప్రజా పాలనలో వంద రోజుల్లోనే నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, విడుదల చేసామని, గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల చేయడం, జలజీవన్ పథకంలో వైసీపీ ప్రభుత్వం 4500 కోట్ల స్కామ్ చేసి ప్రజలకు ఇంటింటికి వేయాల్సిన కుళాయిలు ఆగిపోయాయి అన్నారు. వరదలతో అతలాకుతలమైన మన రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారిని అన్ని విధాలుగా ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించడం, గత వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి బకాయిలు చెల్లించి రైతులను ఆదుకోవడం, ఇక దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరుగుతుందని, మహిళకు ప్రతి నెల 1500 రూపాయలు పథకం కూడా త్వరలో ప్రారంభిస్తారని, మనది అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని అన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో గత వైసీపీ ప్రభుత్వం ఏకంగా జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యి వాడుతున్నారని తెలియడం చాలా భాదాకారం, దేవుడి దగ్గరే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడటం దారుణమని, ప్రజలకు ఈ వంద రోజుల్లో చేసిన మంచిని తెలిపేందుకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందనీ అన్నారు.

## ఘనంగా యరపతినేని నిఖిల్ పుట్టినరోజు వేడుకలు

**దాచేపల్లి మేజర్ న్యూస్ :** మండలంలోని కేసానుపల్లి గ్రామంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు యరపతినేని నిఖిల్



పుట్టినరోజు వేడుకలను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరి రామకోటయ్య ఆధ్వర్యంలో భారీ కేక్ ఏర్పాటు చేశారు. నిఖిల్ పుట్టినరోజును తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తీన్ మార్ డప్పులు, డిజెలతో మారుమ్రోగింది. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేసి యరపతినేని నిఖిల్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరి రామకోటయ్య మాట్లాడుతూ , గురజాల శాసన సభ్యులు యరపతి నేని శ్రీనివాసరావు చిన్న కుమారుడు నిఖిల్ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం తమకెంతో సంతోషాన్నిస్తుంది అన్నారు. నిఖిల్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే ఆయన తండ్రి లాగా వృద్ధి చెందాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బొల్లా కిట్టారావు, సర్పంచ్ శ్రీపతి ప్రసాదరావు, నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, నెల్లూరి హనుమంతరావు, కొల్లూరి నాగేశ్వరరావు, కోట సాయి, తోట నాగేశ్వరావు , కోట మధు, షేక్ చంటి, షేక్ నాగుల్ మీరా, చెట్టిపోగు యేసయ్య , వినుకొండ సుధీర్ కుమార్ , చెట్టిపోగు ఏసుదానం, శ్రీపతి లింగయ్య , చెట్టిపోగు ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు."ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం నరసరావుపేట పట్టణంలో స్థానిక 03,11 వార్డుల్లో శుక్రవారం ప్రారంభించగా ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.100 రోజులు ఎన్డీఏ పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలతో ప్రజల చేత "ఇది మంచి



ప్రభుత్వం" అని అనిపించు కుంటుందన్నారు. అవ్వ తాతల పెన్షన్ 4000, వికలాంగుల పెన్షన్ 6000, లక్షలాది మంది పేదల ఆకలి తీర్చే "అన్న క్యాంటీన్లు", యువత భవిష్యత్తుకు "మెగా డీఎస్సీ" ప్రజల ఆస్తుల భద్రతకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, వరద బాధితులను ఆదుకోవడం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాలు ఉన్నాయని ప్రజల కోసమే అవన్నీ చేస్తున్నాయని ఎమ్మెల్యే చదలవాడ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుని పెద్దకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి..



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ సీపీ నాయకులు బాదుగున్నల సూర్యనారాయణ పెద్దకర్మ శుక్రవారం 33వ వార్డు శిశు మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ చిత్రపటానికి వైసీపీ నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గోపిరెడ్డి తో పాటు 23వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పూనూరి కోటి రెడ్డి, 33 వ వార్డు వైఎస్ఆర్సీపి ఇన్చార్జ్ మద్దిపూడి రాంబాబు, 25 వ వార్డు వైఎస్ఆర్సీపి ఇంచార్జ్ అచ్చి శివకోటి, 23 వ వార్డు మాజీ రేషన్ షాప్ డీలర్ బాదుగున్నల తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ గాంధీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 29న 5కే రన్ : డాక్టర్ కారసాని

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** గుండె, రక్తనాళాలు, పక్షవాతం, జబ్బులు ఎలా వస్తాయి.. వాటిని ఏ విధంగా నివారించాలి అనే అంశంపై అవగాహన.. తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తెరగాలని డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్నంలోని మహాత్మ గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకొని మహాత్మ గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5 కే రన్ ను నిర్వహిస్తున్నామన్నారు. పట్నంలోని డాక్టర్ కోడెల స్టేడియం నుండి ఉదయం 6 గంటలకు ఈ యాత్ర ప్రారంభమై




ప్రధాన రహదారుల మీదుగా తిరిగి కోడెల స్టేడియంకు చేరుకుంటుందని చెప్పారు. ఈ గొప్ప కార్యక్రమంలో పాల్గొనేందుకు 6300184095, 8309797392, 9502304422 నంబర్లను సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించు కున్న ప్రతి ఒక్కరికి టీ షర్టు, టోపీ, రూ.500 నగదును ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 కే రన్లో పాల్గొన్న సభ్యుల నుండి నలుగ్గురు వ్యక్తులను ఎంపిక చేసి లక్కీ డ్రా నిర్వహిస్తామని డ్రా లో గెలుపొందిన వ్యక్తులకు రూ.10 వేలు విలువచేసే సైకిళ్లను గిఫ్ట్గా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. గుండె, రక్తనాళాలు, పక్షవాతం, జబ్బులను పాల ద్రోలెందుకు ఈ నడక బాగా ఉపయోగపడుతుందని వివరించారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ అధినేత డాక్టర్ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

## రైతులందరూ సాగుచేసిన పంటలను ఈ-పంట నమోదు చేయించుకోవాలి : ఏవో



**పిడుగురాళ్ళ, మేజర్ న్యూస్ :** మండలంలోని రైతులు అందరూ సాగుచేసిన పంటలను పంట నమోదు చేయించుకోవాలి అని పిడుగురాళ్ల మండల వ్యవసాయ అధికారి ఎన్ శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. ఈ -పంట నమోదు తో పాటు ఈ కేవైసీ తప్పనిసరిగా చేపించుకోవాలని తెలియజేశారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలు, రాయితీలకు అర్హులని తెలియజేశారు. పంట నమోదుకు ఆఖరి తేదీ ఈ నెల 23 అన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది పంట నమోదును వేగవతం చేయాలని, అలసత్వం ప్రదర్శించ వద్దని సూచించారు. అలాగే, సాగు చేసిన ప్రతి రైతు కూడా రైతు సేవా కేంద్రము నందు డాక్యుమెంట్స్ ఇచ్చి పంట నమోదు చేపించుకోవాలని ఏవో తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకో వడంతో పాటు మంచి నిడనిచ్చే చెట్లను నాటాలని ఈవోపిఆర్డీ రవికుమార్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గ్రామాలలో మురుగు నీటి కాలువల శుభ్రత ప్లాస్టిక్ వాడటం వలన జరిగే అనర్ధాలపైన బహిరంగ మల మూత్ర విసర్జన వలన జరిగే అనర్ధాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ వీర్ల వెంకటస్వామి సహకారంతో చెట్లను నాటించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్యాద్రి,షేక్ రబ్బాని, మల్లికార్జునరావు, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి,సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ గురవారావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈపూరులో ఇది మంచి ప్రభుత్వం

**ఈపూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని ప్రభుత్వం కృషి చేస్తుందని ఈపూరు మండల స్పెషల్ ఆఫీసర్ మరియు డిస్టిక్ హార్టికల్చర్ అధికారి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామపంచాయతీ నందు ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈపూరు గ్రామ సర్పంచ్ పల్ల మీసాల చెంచయ్య, ఎంపీడీవో ఏవి. రంగనాయకులు, తాసిల్దార్ కే. నళినిలతో కలిసి ఇంటింటికి వెళ్లి వందరోజుల పరిపాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఈరోజు నుంచి వారం రోజులు 26వ తేది వరకు కొనసాగుతుందని ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు వివరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వారు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ ద్వారా ప్రతి పేదవాడు,కూలీలు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్కువ ధరకు అల్పాహారం,భోజనం చేయవచ్చని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వమని100 రోజుల వ్యవధిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వాడవాడలా తిరిగి గ్రామస్తులకు వివరించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్ రమేష్,బొల్లా సుబ్బారావు, కిషోర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈ 23న సత్తెనపల్లిలో జాబ్ మేళా

**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా నైపుణ్యాభివృద్ధి , శిక్షణ సంస్థ అధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ ఎక్చ్సేంజ్, సీడాప్‌ల సంయుక్త సౌజన్యంతో జాబ్ మేళను నిర్వహిస్తున్నామని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 23వ తేదిన, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాబ్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాను నియోజకవర్గ పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసిందిగా తెలియజేశారు. జాబ్ మేళాకు సుమారు 4 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఉదాహరణకు ఐల అగ్రి సర్వీసెస్ ప్రైవేట్ లెమిటెడ్, బిజడ్ ఫిన్సర్వ్ ప్రైవేట్ లెమిటెడ్, రిలయన్స్ రిటైల్ మరియు శ్రీ విజయ బయో ఫర్టిలైసర్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయి అని తెలియజేసారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు 10000- 35,000 రూపాయల వరకు ఉండవచ్చని తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిసఐ, డిగ్రీ, బి.టేక్, డిప్లొమా, ఫార్మసి, మరియు పి.జి విభాగముల వరకు చదువుకున్నటు వంటి 18-30 సం౹౹ల వయసు గల నిరుద్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కాగలరని కోరారు. వివరాలకు ఇ. రామకృష్ణ రెడ్డి : 8074393466, బి.అంజి రెడ్డి : 9494986164 లలో సంప్రదించా లన్నారు. ముందుగా https://skilluni-verse.apssdc.in/ అనే వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** రానున్న రోజుల్లో పెదకూరపాడు నియోజకవర్గాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెద్దకూరపాడు మండల పరిధిలోని గాక్ పాడు గ్రామంలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం గడిచిన 100 రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్‌లు, పెన్షన్‌ల పెంపు, ఉచిత ఇసుక పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుం దన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమా లను గ్రామ ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఇది మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆరు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తాం అన్నారు. గ్రామ సభల్లో వచ్చిన సమస్యల తీర్మానాలకు ఆమోదం తెలిపి పనులను వేగవంతం చేస్తున్నాం అని తెలిపారు. భవిష్యత్తు కార్యచరణను సిద్ధం చేసి పెదకూర పాడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమా లను అంచలంచెలుగా అమలు చేస్తాం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ రీసర్వేలో జరిగిన అవకతవకలను వెలికి తీసి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ సభల ద్వారా వచ్చిన రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం అన్నారు. వైసిపి ప్రభుత్వంలో భ్రష్టుపట్టిన వ్యవస్థల ప్రక్షాళనను చంద్రబాబు టిటిడితో మొదలు పెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి ప్రభుత్వ నాయకులు ప్రజలు అజక సంఖ్యలో పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతుల్ని ఆదుకోండి : మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**పెదకూరపాడు, మేజర్ న్యూస్**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సుమారు 15 నుంచి 20 వేల రూపాయలు ఎకరానికి పెట్టుబడి పెట్టిన రైతులు పంట మునిగి తీవ్రంగా నష్టపోయారని వెంటనే ఇన్పుట్ సబ్సిడీ పంటల భీమా అమలు చేసి వారికి అండగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 1,22,900 ఎకరాలు సాగు భూమి ఉండగా అందులో 61 వేల 300 ఎకరాల్లో పత్తి, సుమారు 25 వేల ఎకరాల్లో వరి, కంది, మినుమ, పెసర, పసుపు తదితర పంటలు వేశారని ఈ నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల ముంపుకు గురై సుమారు 25 వేల నుంచి 40 వేల ఎకరాల వరకు పంటలు పూర్తిగా మరియు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు.



ఎన్యుమరేషన్ లో పలు ఆంక్షలు విధించి కేవలం 5 ఎకరాలకే పంట నష్టం వాటిలినట్టుగా అంచనాలు వేశారని దీనివల్ల వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. నీట మునిగిన ప్రతి ఎకరాకు పంట నష్ట ఇవ్వాలని డిమాండ్ చేశారు.గతంలో ఈ విధంగా నష్టం వాటిలినప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు సచివాలయ సిబ్బందితో ఎన్యుమరేషన్ చేయించి ప్రతి హెక్టార్కు 17వేల రూపాయలు నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని పంటల భీమా అమలు చేయడం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు రకరకాల ఆంక్షలుతో కేవలం 5000 ఎకరాల్లోనే పెదకూరపాడు నియోజకవర్గంలో పంట నష్టం వాటిల్లినట్టుగా అంచనాల వేశారని పేర్కొన్నారు. అచ్చంపేట మండలంలో కేవలం 488 ఎకరాలు, బెల్లంకొండ మండలంలో 77 ఎకరాలు, క్రోసూరు మండలంలో 319 ఎకరాలు నష్టం వాటిందని అధికారులు అంచనా వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు పెదకూరపాడు అమరావతి మండలాల్లో 72,000 ఎకరాల్లో పంటలు వేస్తే కేవలం 4000 ఎకరాల్లోనే పంట నష్టం నమోదు చేశారని పునః పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

## రెవెన్యూ అక్రమాలపై ఎమ్మెల్యే జీవికి వినతి

**వినుకొండ, మేజర్ న్యూస్ :** మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన రెవెన్యూ అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చర్యలు తీసుకోవాలి అని,అక్రమాలు చేసిన స్టాఫ్ ను బదిలీ చేయాలి, వారిపై విచారణ జరపాలి, బాధిత రైతులకు న్యాయం చేయాలి. ప్రజా సంఘాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. ఆస్తి రికార్డులతో పని లేకుండా, భూమి ఆక్రమించి గట్లు వేసిన, గట్లు లేకపోయినా, ఎవరి పేరుతో ఎంత భూమిని రెవెన్యూ అధికారులు కేటాయిస్తే అదే చట్టమని గతంలో జగన్ ప్రభుత్వం ఒక విదానం రాష్ట్రంలో అమలు చేశారు. అదే వరవడిలో ఉన్న రెవెన్యూ వాళ్లు దానినే ఫాలో అవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ చర్యలు నిలిపివేయాలని కోరుతున్నామనీ వారు తెలిపారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవిన్యూ గ్రామంలో ఎన్నడూ లేని విధంగా రీ సర్వేలో అవకతవకులు అక్రమాలు జరిగాయి. ఎమ్మార్వో మారినా గతంలో అక్రమాలు చేసిన వాళ్ళ మండల ఆఫీస్‌లో ఉండడంతో, బాధితులకు న్యాయం జరుగుతుందన్న భరోసా లేదు. లోపాలలో కొన్ని సర్వేనెంబర్ 256-ఏ 1లో ఒక ఎకరం 31 సెంట్లు భూమి ఉన్నదని సమాచార హక్కు చట్టం ద్వారా వినుకొండ డిప్యూటీ తాహసిల్దార్ గారు ఇవ్వడం జరిగింది. ఇదే సర్వే నెంబరుకు రికార్డో భూమి లేకపోయినా ఎల్ పి నెంబర్ 1479 ఒక ఎకరం 51 సెంట్లు, ఎల్ పి నెంబర్ 1621 లో 7 సెంట్లు మొత్తం158 సెంట్లుగా (19 సెంట్లు పెంచారు) సర్వే నెంబర్ 256 -బి1లో 45 సెంట్లుగా దశాబ్దాలుగా ఉన్నదాన్ని డిప్యూటి తాహసిల్దారు 45 సెంట్లు గానే ఇవ్వడం జరిగింది. ఆ భూమిని ఎల్ పి నెంబర్ 1478 పేరుతో 40 సెంట్లు తగ్గించి రికార్డు కెక్కించారు. లేని వాళ్ళకి ఎక్కువ ఎక్కించడం, ఉన్నవాళ్లకు తగ్గించడం రెవెన్యూ వాళ్ళ మాయాజాలం జాలంగా మారిందన్నారు. సర్వే నెంబర్ 220-1- 2 ఏలో 243 సెంట్ల లో సుమారు 20 సెంట్లు తగ్గించారు. సర్వే నెంబర్ 48/2-12లో ఒక ఎకరం 74 సెంట్లలో 85 సెంట్లు మాత్రమే రికార్డ్‌కు ఎక్కించారనీ, తగ్గటానికి, పెరగటానికి రెవెన్యూ వాళ్ళ దగ్గర ఏం మంత్రం ఉందో చెప్పాలి. స్థానిక కోర్టు సెంటర్లో జరిగిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో జి.రామకృష్ణ జిల్లా కార్యదర్శి ఫోన్ నెంబర్ దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎమ్)పల్నాడు జిల్లా కమిటీ ఓర్సు కృష్ణ ఎం సిపిఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు చికినం చిన్న , పౌర హక్కుల సంఘం , నాయకులు పాల్గొన్నారు.

## 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం



**రెంటచింతల మేజర్ న్యూస్ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 100 రోజుల్లో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు ప్రతి గడపకు వెళ్లే విధంగా తలపెట్టిన కార్యక్రమానికి శుక్రవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచిన క్రమంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. పంచాయతీలకు నిధులు, ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లింపు, ఎన్టీఆర్ భరోసా కింద పేదలకు పెరిగిన పింఛన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో భూ యజమానులకు ఉపశమనం, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకాలతో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు లబ్ది పొందుతున్నారన్నారు.ప్రజల కోసం నిరంతరం పనిచేస్తే పాలన ఎలా ఉంటుందో 100 రోజుల ప్రగతి ఓ ఉదాహరణగా పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, తెదేపా నేతలు గొంటు సుమంత్ రెడ్డి,మూలి రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, నాళం బాబు, ఓరుగంటి ఇన్నారెడ్డి, మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా బీజేపీ సభ్యత్వ నమోదు



**వినుకొండ, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ అఖిల భారత స్థాయిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024లో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు పురందరేశ్వరి ఆదేశానుసారం వినుకొండ పట్టణంలో శివయ్య స్తూపం సెంటర్లో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.పల్నాడు జిల్లా సభ్యత్వ ప్రముఖ పోత్రు పూర్ణచంద్ర రావు శిబిరాన్ని సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది. మోడీ నాయకత్వంలో భారతదేశం సురక్షితంగా ఉందని జిల్లా అంతా కూడా మంచి సానుకూలత భారతీయ జనతా పార్టీ పట్ల ఉన్నదని అనేకులు కొత్తవారు కూడా భారతీయ జనతా పార్టీ సభ్యులుగా చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి వినుకొండ పట్టణ అధ్యక్షులు ఆడిటర్ రాఘవులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోనే భారతదేశం ద్విగుణీకృతం ఉత్సాహంతో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని, భారతదేశం సురక్షితంగా సమృద్ధిగా అభివృద్ధి చెందాలన్నా మన సంస్కృతి సాంప్రదాయాలను నిలబెట్టాలన్న భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోనే సాధ్యమవుతుందని కాబట్టి బిజెపి సభ్యులుగా చేరి భారతదేశాన్ని అభివృద్ధి బాట పట్టించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ మాట్లాడుతూ సామాన్య ప్రజల కోసం రైతుల కోసం అనేక పథకాలు మోడీ ప్రవేశపెట్టారని సామాన్య ప్రజల అభ్యున్నతి భారతీయ జనతా పార్టీ తోనే సాధ్యమవుతుందని కావున ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోదావర్తి సుజాత పట్టణ ఉపాధ్యక్షులు సుధా గణేష్ బాబు, గర్రె అనిల్, గర్రె రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శులు కోట వెంకట సుధాకర్, దేసు వెంకట లక్ష్మీనారాయణ, కోశాధికారి దేవతి చిన్న నరసింహారావు, అప్పల రాజా, సీనియర్ నాయకులు అచ్యుత వెంకట ముర్తయ్య , చందులూరి సుబ్బారావు, మండల అధ్యక్షులు పూరేటి పేరయ్య మాజీ మండల అధ్యక్షులు శివాజీ వెంకయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మి, జవ్వాజి రాఘవ జక్కా మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## నాగులవరంలో స్వచ్ఛత హి సేవ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** స్వచ్ఛత హీ సేవా –2024, 4వ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగులవరం గ్రామ సచివాలయం నందు క్లాప్ మిత్రాలకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చెయ్యడంతో పాటు గ్రామ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చెయ్యడం గురించి వివరించడం జరిగింది కార్యక్రమంలో నాగులవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ నూనె. కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి. ఉదయ్ కుమార్, ఎం ఆర్ సి పి. ప్రభాకరరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, క్లాప్ మిత్రాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భట్లూరులో "ఇది మంచి ప్రభుత్వం"

**సత్తెనపల్లి రూరల్ , మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా భట్లూరు గ్రామంలో జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ ఓబుల్ నాయుడు, ఎంపిడిఓ జీవీ సత్యనారాయణలు ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొన్ని ముఖ్యమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. భట్లూరు గ్రామం తో పాటు గుజ్జర్లపూడి గ్రామం లో కూడా నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఈఓపి అండ్ ఆర్ డి భీమనేని దయాసాగర్, రెండు గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత హీ సేవా పై అవగాహన ర్యాలీ



**ఈపూరు, మేజర్ న్యూస్ :** స్వచ్ఛత హీ సేవా కార్యక్ర మంలో భాగంగా స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఈపురులో తాసిల్దార్ నళిని, ఎంపీడీవో రంగనాయకులు, సచివాలయ సిబ్బంది, ఈపూరు గ్రామ సర్పంచి, సిబ్బంది, టిడిపి నాయకులుతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాడవాడలా తిరుగుతూ అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా స్వచ్ఛత పాటిస్తూ ఇతరుల చేత స్వచ్ఛత పాటించే విధంగా అందరికీ అవగాహన కల్పించాలని వారు కోరారు. పరిసరాలు పరిశుభ్రత, పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు పాటించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాలలో ఎస్ డబ్ల్యూ బిసి కేంద్రాలలో చెత్త నుండి వర్మీ కంపోస్టు ఎరుగలను తయారు చేయడం, క్లోరినేషన్, నీళ్ల ట్యాంకులను పరిశుభ్రం చేయడం, కాలువలలో మురుగునీరు నిలవకుండా చూడడం, రోడ్లపై చెత్త లేకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిన్నెల్లిలో ఇది మంచి ప్రభుత్వం

### పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



**మాచవరం, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామం నందు ప్రభుత్వం ఏర్పడి 100 పూర్తయిన సందర్భంగా "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం లో పాల్గొన్న గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి. పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామం నందు మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా, ఈ 100 రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని ప్రజలకు వివరించిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు , ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మరియు మాచవరం మండలంలో తెలుగుదేశం పార్టీ, బీజేపీ పార్టీ, జనసేన పార్టీల రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయిలలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు కార్యకర్తలు, యువత, మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట మండలం వేలూరు స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కం సెలక్షన్



**చిలకలూరిపేట రూరల్ మేజర్ న్యూస్ :** చిలకలూరిపేట మండల స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ వేలూరు క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు.ఇ పోటీలకు మండల పరిధిలో ఉన్న హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ ,కోకో గేమ్స్ అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు టోర్నమెంట్ కం సెలక్షన్ జరిగినవి ఈ యొక్క పోటీలకు మండల పరిధిలోని హైస్కూల్ నుండి 320 క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే ఒక టోర్నమెంట్లో పాల్గొని మంచి క్రీడా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను చిలకలూరిపేట మండల స్థాయి టీంకు ఎంపిక చేశారు. ఈ యొక్క పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సురేష్ కుమార్ పర్యవేక్షణలో చిలకలూరిపేట మండల కోఆర్డినేటర్ పొదిలి వెంకటేశ్వర్లు నియోజకవర్గ కోఆర్డి నేటర్ ఇస్మాయిల్ పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఖాదర్ మస్తాన్ చిలకలూరిపేట జోన్ అధ్యక్షులు ఎస్.కె కాసిం బుడే సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అత్యాయమే సువర్ణ రాజు రాజు మనోహర్ కపిల్ డేవిడ్ రాజ్ అమీర్ తిరుమల బాయ్ మీనా కుమారి సంటి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగిన కూటమి వందరోజుల పాలన : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రజా ప్రభుత్వ పాలన ఎంతో అభివృద్ధి దిశగా ఎన్నో అడుగులు వేసింది. వందరోజుల పాలన అత్యద్భుతమని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి వారం రోజులపాటు కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించడం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజలకు వివరించడం జరుగుతుందని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేసారు. శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్లో ప్రారంభించబడిన 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, ఐదేళ్లు రాజకీయ అక్కసు ప్రదర్శించి రాక్షసానందం పొందిన నిరంకుశత్వం బద్దలై ప్రజల ఆకాంక్షల నుంచి ఉదయించిన కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు,కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ , షాజీలా, వార్డు అధ్యక్షులు జస్వంత్, జాగర్లమూడి శ్రీనివాస్,శ్రీను నాయక్, జడ సురేష్,శేఖర్,అంకమ్మరావు,ఉమాశంకర్, వరలక్ష్మి, వెంకట్,భాస్కర్,ఓంకార్, మణికంఠ, కోదండపాణి, ఫణి, వెంకట్రావు, ఐల శీను, మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## రాతియుగం నుండి స్వర్ణ యుగం వైపు అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



రాష్ట్రం రాతియుగం నుండి స్వర్ణయుగం వైపు అడుగులు వేస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ప్రజల్లోకి వెళ్లారు శుక్రవారం 24వ డివిజన్ అంకమ్మ నగర్ నుండి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి తిరిగి ఈ 100 రోజులలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కరపత్రం రూపంలో ప్రజలకు అందజేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళ మాధవి మాట్లాడుతూ... "ఇది మంచి ప్రభుత్వం" పేరుతో ప్రజలలోకి వెళ్తున్నామని, వారి నుండి అపూర్వ స్పందన లభిస్తుందని, ప్రభుత్వం వచ్చిన వందరోజుల్లోనే ప్రజల్లోకి నేరుగా వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడుగుతున్నామంటే అది మా నిజాయితీ, నిబద్ధతకు నిదర్శనం అని ఎమ్మెల్యే గళ్ళ మాధవి పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో నా పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకోవటం జరుగు తుందని వారి నుండి మంచి స్పందన లభిస్తుంది అన్నారు.కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, కోవెలమూడి రవీంద్ర,రాజీవ్ ఆనంద్, మానుకొండ శివ ప్రసాద్,మద్దిరాల మ్యాని,కనపర్తి శ్రీనివాస్, కసుకుర్తి హనుమంతరావు, సుఖవాసి శ్రీనివాస్, ఆళ్ల హరి, దాసరి రమణ,దామచర్ల శ్రీనివాస్, మానం పద్మశ్రీ, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ (బుజ్జి), శ్రీవల్లి, కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వర ప్రసాద్, ముత్తినేని రాజేష్, షేక్ బుడే, కొల్లి అనిల్,కామినేని చంద్ర, కరంగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా విజిలెన్స్ విచారణ : బూదాల విమర్శ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** తెల్లరేషన్ కార్డు లబ్ధి దారులకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం ఇవ్వకుండా, నగదు ఇస్తూ అక్రమ బియ్యం వ్యాపారానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై తాము తహశీల్దారుకు ఫిర్యాదు సమర్పించామని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. అయితే తమ ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణకు వచ్చారని, రేషన్ షాపుల వద్ద మొక్కుబడిగా విచారణ జరిపి వెళ్ళారని, ప్రజా సంఘాలనుకానీ, లబ్ధి దారులను కానీ విచారించ లేదని ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బూదాల శ్రీనివాసరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత మూడు నెలలుగా ఎండియూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా నిలిచిపోయిందని, రేషన్ దుకాణాల వద్ద లబ్ధి దారులు ఇబ్బందులుపడుతున్నారని, రేషన్ షాపుల వద్ద ఎండియూ వాహన దారుని వేలిముద్రతో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు లెక్కలు చూపుతూ బియ్యంకు బదులు డబ్బులు ఇస్తున్నారని, తద్వారా బియ్యం పెద్ద మొత్తంలో నిల్వ చేసి, అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాబోయే నెలలో ప్రతి ఒక్క లబ్ధి దారునికి బియ్యం ఇవ్వాలని అలా ఇవ్వని పక్షంలో తాము ప్రజల పక్షాన నిలబడిపోరాటం చేస్తామన్నారు. విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, సిపిఐ నాయకులు పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, యోహాను, నాసరయ్య, కొప్పరపు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

